క్లుప్తంగా

వాడనర్సాపురంలో క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సుకుమారవర్మ

రాంబిల్లి: వాడనర్సాపురంలో ఆదివారం క్రికెట్ పోటీలను డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ(తేజ) ప్రారంభించారు. డిసెంబరు 3న గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం తేజ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, వైస్ ఎంపీపీ కొట్టాపు లక్ష్మీవడ్డికాసులు, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, సర్పంచ్ కారె రామారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాండెక్స్‌లో 400 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండెక్స్ అపెరల్ పార్కులో ఆదివారం 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్రాండెక్స్ ఇండియా సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా 116వ ఉచిత వైద్య శిబిరం ఇది. కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న వారిలో 271 మందికి కళ్లద్దాలు అందించారు. 82 మందికి మందులిచ్చారు. 35 మందికి కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సిఫార్సు చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 14 మంది రక్త దానం చేశారు. కంటి శిబిరం, రక్త శిబిరాలను బ్రాండెక్స్ భారత భాగస్వామి దొరైస్వామి పర్యవేక్షించారు.

వేడుకగా అయ్యప్ప పేట తుల్లి ఉత్సవం



పేట తుల్లి ఆడుతున్న అయ్యప్ప భక్తులు

యలమంచిలి: యలమంచిలి ప్రధాన రహదారిలో ఆదివారం అయ్యప్ప నామస్మరణ మారుమ్రోగింది. పట్టణంలోని అయ్యప్ప భక్తులు ఘనంగా పేట తుల్లి ఉత్సవం నిర్వహించారు. స్థానిక కొత్తపేట అయ్యప్పస్వామి ఆలయం నుంచి పాత జాతీయ రహదారి మీదుగా అయ్యప్ప శరణు ఘోష, భక్తి గీతాలను ఆలపించారు. పట్టణంలో ఉన్న అయ్యప్ప భక్తులతో ప్రధాన రహదారి కిక్కిరిసిపోయింది. పేట తుల్లి ఉత్సవం స్థానిక ప్రజల్ని ఎంతగానో ఆకట్టుకుంది. అయ్యప్పస్వామిని పల్లకిలో ఉంచి వివిధ రంగులు పూసుకుని నృత్య ప్రదర్శనగా పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. పట్టణం, మండలంలోని అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.

త్వరితగతిన ఆలయ నిర్మాణం



ఆలయ నిర్మాణానికి నేలను చదును చేస్తున్న దృశ్యం

కోటవురట్ల: మండలంలోని కె.వెంకటాపురంలో నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవలే ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి హోమం నిర్వహించారు. ఆదివారం పాత ఆలయాన్ని కూల్చేసి, ఆ ప్రాంతాన్ని చదును చేసే పనులు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ మాట్లాడుతూ గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వీలైనంత వేగంగా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షకు స్పందన

కశింకోట: స్థానిక డీఏఎస్ జెడ్పీ హైస్కూల్లో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షను ఆదివారం నిర్వహించారు. సుమారు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తమ మార్కులు పొందిన 10 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. సంస్థ ప్రతినిధి ఎస్.రమేష్, జిల్లా సైన్స్ అధికారి కాళిదాస్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు చేయూత



కుటుంబ పోషణకు ఊతం

ఈమెది రాంబిల్లి మండలం కట్టుబోలు. పేరు కొఠారు వరలక్ష్మి. వీరికి ఎకరం మాత్రమే పొలం ఉంది. భర్త వ్యవసాయం చేస్తారు. ఈ ఎకరా పొలంపై ఏడాదికి ఖర్చులు పోనూ నాలుగైదు వేలు మాత్రమే దక్కుతున్నాయి. ఈ తరుణంలో వరలక్ష్మికి చేయూత.. నిజంగా ఆమెకు ఊతం ఇచ్చింది. చేయూత సాయానికి రూ.లక్ష బ్యాంకు నుంచి రుణం పొంది సొంత ఊరులోనే కిరాణా దుకాణం పెట్టింది. వ్యాపారం సాగిస్తూ ఈ రూ.లక్ష బ్యాంకు రుణం చెల్లించింది. ఇదే ఉత్సాహంతో ఆమె మరో రూ.లక్ష వ్యాపార వృద్ధి కోసం రుణం పొంది ఆ రుణం కూడా చెల్లించింది. చేయూత పథకం తనలాంటి మహిళల ఆర్థిక ఎదుగుదల, కుటుంబపోషణకు ఎంతో తోడ్పాటునిస్తుందని ఆనందంగా వరలక్ష్మి చెబుతోంది.

ఉపాధికి ఆలంబనగా..
కుటుంబ పోషణకు అండగా...
సత్ఫలితాలిస్తున్న వైఎస్సార్ చేయూత పథకం



రాంబిల్లి : సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీ లక్ష్యం..పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేశారు. నవ రత్నాలు పేరుతో సంక్షేమ పథకాల జాతర లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. ఈ నవరత్నాల పథకాల్లో ఒకటి వైఎస్సార్ చేయూత.. పేరుకు తగ్గట్టే ఈ పథకం ఎందరో మహిళలకు వరంలా మారింది. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు నందించడమేగాక వారి కుటుంబ పోషణకు అండగా నిలుస్తుంది.

రుణ సాయం

వైఎస్సార్ చేయూత పథకం ద్వారా లబ్ధిపొందిన అక్కచెల్లెమ్మలు చిన్న దుకాణాలు నడుపుకొంటూ ఆర్థికంగా ఎదగడమే కాకుండా కుటుంబ పోషణ చేసుకుంటున్నారు. మరి కొందరు గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్ల ఇలా పలు రకాలుగా వారి వారి అవకాశాలు బట్టి కొనుక్కొని వాటిని నిర్వహించడం ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారు. ఈ పథకం కింద ఏడాదికి రూ.18,750 చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు మూడు దఫాలుగా ఈ నిధులు చెల్లించారు. అంతేగాక అవసరమైన వారికి బ్యాంకుల ద్వారా రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు రుణం ఇప్పిస్తున్నారు.

మండలంలో వైఎస్సార్ చేయూత లబ్ధి

లబ్ధిదారుల సంఖ్య	నిధుల సాయం
2738	రూ. 15.19 కోట్లు

ప్రతి లబ్ధిదారుకు చెల్లిస్తున్న మొత్తం : రూ.18,750

బ్యాంకుల ద్వారా రుణసాయం రూ.50 వేలు నుంచి రూ.లక్ష

ఊరిలోనే ఉపాధి...



ఈమెది అప్పన్నపాలెం. పేరు గొర్లె లక్ష్మి. భర్త వ్యవసాయ కూలి. రెండు ఆవులు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మికి వైఎస్సార్ చేయూత పథకం మంజూరైంది. ఈ నిధులతో ఇదే గ్రామంలో చిన్న కిరాణా దుకాణం పెట్టుకుంది. ఈ దుకాణం ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నట్టు ఆమె ఆనందంగా చెబుతున్నారు. ఈ దుకాణం ద్వారా కుటుంబపోషణ సాగిస్తున్నామని చేయూత పథకం ఎంతో మంచి పథకమని లక్ష్మి అభిప్రాయపడుతున్నారు.

స్వయం ఉపాధికి దోహద పడుతుంది..



రాంబిల్లి మండలంలో వైఎస్సార్ చేయూత పథకంలో 2738 మంది లబ్ధిదారులు లబ్ధి పొందారు. వీరికి ఈ పథకం కింద రూ.15 కోట్ల19 లక్షల 59వేలు నిధుల సాయం అందింది. మహిళల ఆర్థిక స్వావలంబనకు చేయూత పథకం తోడ్పడుతుంది. అంతేగాక స్వయం ఉపాధికి, కుటుంబ పోషణకు ఉపయోగపడుతుంది.

-కె.ఎస్.కొండలరావు, ఎంపీడీవో, రాంబిల్లి మండలం

ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిత



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న విశ్రాంత డీఈవో తమ్మిరాజు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే పోటీ పరీక్షల్లో రాణించగలరని విశ్రాంత డీఈవో శిష్టా తమ్మిరాజు పేర్కొన్నారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మునగపాక జెడ్పీ హైస్కూల్లో ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష నిర్వహించి, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతం అవుతుందన్నారు. ఇప్పటి నుంచే క్రమశిక్షణ అలవరచుకోవాలన్నారు. చదువులో నిరంతర సాధన ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కేవీ రమణ, రాజు, శివకోటి దుర్గా ప్రసాద్, ఎంవై రాము, మాడెం జోగారావు, అచ్యుతకృష్ణ, ఆడారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నెల్లో పాలు మరిగింపు



వాడపాలెంలో వెన్నెల్లో పాలను మరిగిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని తంతడి శివారు వాడపాలెంలో ఆదివారం రాత్రి కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని వెన్నెలలో పాలను మరిగించారు. వెన్నెలలో మరిగించిన పాలను తాగితే బుద్ధి, ధైర్యం కలుగుతాయని సమరసతా సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో చోడపల్లి సత్యం, భక్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి



మునగపాక దళితవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బొడ్డేడ ప్రసాద్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

మునగపాక: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మునగపాక దళితవాడలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ వల్లే నేడు ఎంతో మంది రాజకీయంగా పలు పదవులు అలంకరిస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అంబేడ్కర్ అందించిన సేవలు మరువలేనివన్నారు.

మునగపాకలోని సంతబయల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎస్ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, పార్టీ నేతలు పిల్లి కనకలక్ష్మి అప్పారావు, బీలా అప్పలనాయుడు, బీలా శివగణేష్, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, గౌతమ పఠన మందిరం అధ్యక్ష, కార్యదర్శులు దాడి సూరిబాబు, వెలగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చినరామన్న కుటుంబం ఆత్మీయ కలయిక

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో ఆదివారం పెంటకోట చినరామన్న కుటుంబం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్తీకమాసంలో భాగంగా అరబుపాలెం వెళ్లే దారిలోని చినరామన్న వ్యవసాయ క్షేత్రంలో వన సమారాధన జరిపారు. కార్యక్రమానికి చినరామన్న కుటుంబానికి చెందిన పిల్లలు, పెద్దలు, వృద్ధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ వైద్య సేవలందిస్తున్న డాక్టర్ పెంటకోట అపర్ణ, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన తనూజను సత్కరించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాల సంఘం డైరెక్టర్ పెంటకోట జగ్గప్పారావు, ఆంజనేయ మూల రైతు సంఘం మాజీ అధ్యక్షుడు పెంటకోట సూరిబాబు, వడ్లపూడి గౌరీ సంఘ సభ్యుడు పెంటకోట భాస్కరరావు, విశాఖకు చెందిన సాయి మాధురి స్పోర్ట్స్ అధినేత పెంటకోట చినసూరిబాబు, ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పెంటకోట జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ అపర్ణను సత్కరిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



దిమిలిలో నగ్నేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి ఊరేగింపు



మునగపాక సాంబశివుని ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న శివభక్తులు

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు చేశారు. ప్రసిద్ధి చెందిన పంచదార్ల పుణ్యక్షేత్రంలో ఉమా ధర్మలింగేశ్వర స్వామి ఆలయం, దిమిలిలో చారిత్రక నగ్నేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక దీపరాధన నిర్వహించారు. దిమిలిలో నగ్నేశ్వరస్వామి, వల్లభ నారాయణస్వామివార్లను పల్లకీలో ఊరేగించారు. జ్వాలాతోరణం నిర్వహించారు.

శివాలయాలకు భక్తుల తాకిడి

మునగపాక: కార్తీకమాసంలో భాగంగా ఆదివారం మండలంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మునగపాకలోని సాంబ శివుని ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం నుంచి సాంబశివున్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వాడ్రాపల్లిలోని దక్షిణేశ్వరుని ఆలయం వద్ద ఉదయం నుంచే భక్తుల సందడి నెలకొంది. మునగపాకలో శివమాలలు ధరించిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి మాడెం జోగారావు ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



కొరుప్రోలులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



బైకు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: భారత రాజ్యాంగం దేశంలో సమానత్వం పెంపొందించి, పేదల అభ్యున్నతికి తోడ్పాటునిచ్చిందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. సమతా సైనిక్‌దళ్ సభ్యులు రాజ్యాంగంపై అవగాహన కలగాలనే ఉద్దేశంతో మండల నలుమూలల యువత పెద్ద ఎత్తున కొరుప్రోలు చేరుకుని అన్ని గ్రామాలు మీదుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కొరుప్రోలు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాలి అర్పించారు. అనంతరం బైక్ ర్యాలీలో పాల్గొని, తిమ్మాపురం, పెదగుమ్ములూరు, దార్లపూడి, చినగుమ్ములూరు, ఎస్.రాయవరం గ్రామాల మీదుగా ఉప్పరాపల్లి చేరుకున్నారు. ఉప్పరాపల్లిలో అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, సమతా సైనిక్ దళ్ సభ్యులు గారా ప్రకాష్‌రావు, విజయ్‌కుమార్, గారా రమేష్, బోడపాటి కొండబాబు, గోపాలకృష్ణ, ఎస్.రాయవరం ఎంపీటీసీ బైపా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం ధారపాలెం బీసీటీ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. బీసీటీ కార్యదర్శి శ్రీరామ్మూర్తి రాజ్యాంగ విశిష్టతను వివరించారు. ప్రపంచానికి ఆదర్శవంతమైన రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవల్ని కొనియాడారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

పాయకరావుపేట: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. పంచాయితీ రాజ్ అతిథి గృహంలో వైఎస్సార్ సీపీ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దేశానికి అంబేడ్కర్ అందించిన సేవలను, భారత రాజ్యాంగ విశిష్టతను కొనియాడారు. కార్యక్రమంలో దళిత నాయకుడు పెదపాటి మేఘరంజన్, జెడ్పీటీసీ లంక సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ధనిశెట్టి బుజ్జి, నాయకులు కేశన కుర్తి సత్తిబాబు, పంచాయతీ సభ్యులు జగతా శ్రీను, పల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: మండలంలోని పేట బయ్యవరం పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ విశిష్టతను తెలిపేలా ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు బొడ్డేడ సత్యనారాయణ భారత రాజ్యాంగ విశిష్టతను విద్యార్థులకు విపులంగా వివరించారు. రాజ్యాంగంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, ఉపాధ్యాయులు బి.ధనలక్ష్మి, శ్రీనుబాబు, వీరభద్రరావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు రాజ్యాంగం పవిత్ర గ్రంథమని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త అంబేడ్కర్ సేవా సంఘం ప్రతినిధి వై.రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పులపర్తి, కృష్ణాపురం గ్రామాల్లో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొని, అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రెండు గ్రామాల్లో పేదలకు అన్న సమారాధన జరిపారు. దళిత సంఘం యూత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘ నాయకుడు కూరపాటి రఘు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



పేట బయ్యవరం స్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



పులపర్తిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న పారిశ్రామిక వేత్త రమేష్‌బాబు

జాబ్ మేళా రేపు

అనకాపల్లిటౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సాయి కుల్వంత్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కామరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులై 35 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. ఈ జాబ్‌మేళాలో 8 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 98492 16362, 73960 13501 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, సేవాభావం

అనకాపల్లి రూరల్: అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఎన్‌సీసీ వలంటీర్లు స్వచ్ఛ శారదా కార్యక్రమంలో భాగంగా శారదానదీ పరీవాహక ప్రాంతంలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో క్రమశిక్షణ, సేవాభావం అలవడుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే సేవాభావం పెంపొందించేందుకు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎన్‌సీసీ కేడెట్లకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ దాడి జగదీష్, లెఫ్టినెంట్ ఏఎస్ఎన్ మూర్తి, ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్, కళాశాల సూపరింటెండెంట్ అనూరాధ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, శ్రీనివాసరావు, 120 మంది ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

శ్మశానంలో పూల మొక్కలు నాటేందుకు చర్యలు



శ్మశానవాటికలో నాటేందుకు సిద్ధం చేసిన మొక్కలు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట శ్మశానవాటికలో నాటేందుకు పూల మొక్కలు సిద్ధం చేసినట్లు ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాండ్రేగుల జగన్ ఆదివారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జెడ్పీ నిధులతో శ్మశానాన్ని అభివృద్ధి చేశామన్నారు. శ్మశానంలోని పరమేశ్వరుని విగ్రహం వద్ద పలురకాల పూల మొక్కలతో ఉద్యానవనంగా తీర్చదిద్దనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కాండ్రేగుల శ్రీనివాసరావు, శరగడం గౌరీ శంకరరావు, మళ్ల నాగ వెంకటరెడ్డి, దొడ్డి నారాయణరావు, ముప్పిడి స్వామి తదితరులు పాల్గొన్నారు.